చంపావతి నదిలో తాగునీటి పథకాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-నెల్లిమర్ల: గుర్ల పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఎస్-ఎస్ఆర్ పేట సమీపంలోని చంపావతి నదిలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని సోమవారం పరిశీలించారు. అక్కడ నీటి నాణ్యత, నీటి శుద్ధి ప్రక్రియ సరఫరా, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో పవన్ కల్యాణ్ చర్చించారు. అనంతరం గుర్ల పీహెచ్ సీలో రోగులను పరామర్శించారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీకలిశెట్టి అప్పలనాయుడు, శాసన సభ్యులు కిమిడి కళా వెంకటరావు, లోకం నాగ మాధవి, కోళ్ల లలిత కుమారి, జిల్లా కలెక్టర్ అంబేద్కర్ పాల్గొన్నారు.

తుఫానును ఎదుర్కొనేందుకు మండలవారీ యాక్షన్ ప్లాన్

గ్రామాలకూ ప్రత్యేకాధికారుల నియామకం
పదిరోజులపాటు గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్
జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: తుఫానును ఎదుర్కొనేందుకు మండలాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. తుఫాను కారణంగా బుధ, గురువారాల్లో జిల్లాలో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వీటిని ఎదుర్కొనేందుకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు, ఆర్డిఓలు, తాసిల్దార్లు, ఎంపిడిఓలు, ఈఓపిఆర్డీలతో కలెక్టరేట్ నుంచి ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 22 నుంచి 26 వరకు స్పెషల్ ఆఫీసర్లతో సహా మండల అధికారులంతా ఆయా మండలాల్లోనే ఉండి చాలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకూడదని స్పష్టం చేశారు. ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో మండల అధికారులంతా ఒక బృందంగా ఏర్పడి పరస్పరం సమన్వయంతో, సహకారంతో పనిచేసి తుఫాను సమర్ధవంతంగా ఎదుర్కొనాలని చెప్పారు. మండల స్థాయి అధికారులను, నాలుగైదు గ్రామాలకు ఒక ప్రత్యేకాధికారిగా నియమించి, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి, ప్రజలను తరలించాలన్నారు. అన్ని వసతులతో పునరావాస శిబిరాలను సిద్ధం చేయాలని, అవసరమైన ఆహార పదార్ధాలను, మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వంతెనలు, కాజ్‌వేల వద్ద కాపలా ఉంచాలని చెప్పారు. ఆర్డిఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించడంతోపాటు, ఎప్పటికప్పుడు పరిస్థితిని జిల్లా కేంద్రానికి తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోలు రూములను ఏర్పాటు చేయాలన్నారు. చెరువుగట్లును బలోపేతం చేయాలని సూచించారు. ఈ ముందు జాగ్రత్త చర్యలతో మంగళవారం సాయంత్రానికి మండల వారీగా యాక్షన్‌ప్లాన్ రూపొందించి అందజేయాలని ఆదేశించారు. గుర్ల డయేరియా సంఘటన నేపథ్యంలో జిల్లా అంతటా రేపటినుంచి పదిరోజులపాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రతిరోజూ త్రాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను మండల ప్రత్యేక అధికారులు, గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో బహిరంగ మల విసర్జనను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని, దీనికోసం ప్రత్యేక ప్రణాళికను త్వరలో రూపొందిస్తామని కలెక్టర్ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ ఎస్డి అనిత పాల్గొన్నారు.

అతిసార బాధితులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శ

ఆసుపత్రిని సందర్శించి వైద్య చికిత్సపై ఆరా

విశాలాంధ్ర-గుర్ల/నెల్లిమర్ల(విజయనగరం): గుర్ల డయేరియా బాధుతులను ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయితీరాజ్, అటవీ, పర్యావరణ శాఖామంత్రి వపన్ కల్యాణ్ పరామర్శించారు. వైద్య చికిత్సపై ఆరా తీశారు. ఆయన సోమవారం గుర్ల, నెల్లిమర్ల మండలాల్లో పర్యటించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో కలిసి పవన్ కల్యాణ్ ముందుగా నెల్లిమర్ల మండలంలోని చంపావతి నది ఒడ్డున ఉన్న కొండపాలెం త్రాగునీటి పథకాన్ని సందర్శించారు. ఇన్‌ఫిల్టరేషన్ బావులు, పైప్‌లైన్లు, నదీజలాలును, పథకానికి సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సి వి.నంజీవరెడ్డి, సిఈ హరేరామ్‌నాయక్, ఎస్ఈ ఉమాశంకర్ పథకం పనితీరును వివరించారు. గుర్ల ప్రాధమిక చికిత్సాకేంద్రాన్ని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. ఆసుపత్రిలో డయేరియాకు చికిత్స పొందుతున్న ఆరుగురు బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య చికిత్సపై ఆరా తీశారు. ఆందోళన చెందవద్దని, మెరుగైన చికిత్సను అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. వారికి అందిస్తున్న వైద్య చికిత్స గురించి వైద్యారోగ్యశాఖ జెడి మల్లేశ్వరి, ఎడి సుబ్రమణ్యేశ్వరి, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ భాస్కరరావు వివరించారు. గుర్ల గ్రామాన్ని డిప్యూటీ సిఎం సందర్శించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికవద్ద బాధిత కుటుంబాలతో భేటీ అయ్యారు. మృతుల కుటుంబాలతో మాట్లాడి వారిని ఓదార్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి, ప్రభుత్వపరంగా ఆ కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాల్లో పిల్లలు ఉంటే, వారి విద్యాభ్యాస బాధ్యతలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. అతిసారం ప్రబలడం పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. డయేరియాను అరికట్టడానికి అన్ని రకాల చర్యలనూ తీసుకుంటున్నామని, ఆందోళన చెందవద్దని చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి కాలుష్య నివారణకు ప్రభుత్వం చిత్తశుద్దితో పనిచేస్తుందని అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత త్రాగునీటిని ప్రతీ ఇంటికీ అందేటట్టు చేస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, చీపురుపల్లి ఎంఎల్ఏ కిమిడి కళా వెంకటరావు, నెల్లిమర్ల ఎంఎల్ఏ లోకం నాగమాధవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి గంధం చంద్రుడు, పలువురు నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శంబంగి వదిన అమ్మడమ్మ అకాల మృతికి పలువురు సంతాపం

విశాలాంధ్ర-బొబ్బిలి: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వదిన విశాఖ డైరీ సీనియర్ డైరెక్టర్ శంబంగి అమ్మడమ్మ అనారోగ్యంతో విశాఖపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పార్థివదేహాన్ని సొంత గ్రామం మండలం పక్కి గ్రామంలో ఉంచారు, పలువురు ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు, అమ్మడమ్మ మృతికి పలువురు రాజకీయ నాయకులు, ఉద్యోగులు, ప్రజా పతినిధులు, ఓం శాంతి బ్రహ్మ కుమారీలు, సామాన్య ప్రజలు సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. అమ్మడమ్మ మృతదేహం అంతిమ యాత్ర నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, (చిన్న శీను) తదితరులు పాల్గొన్నారు.

రీ- సర్వే భూ సమస్యలకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో జరుగుతున్నరీ-సర్వే భూ సమస్యలకు రైతుల నుండి అనూహ్య స్పందన వస్తుంది. సోమవారం కొరటాం గ్రామ సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి చీకటి. శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగి నరీ-సర్వే భూ సమస్యలకు రైతుల నుండి దరఖాస్తులు హెచ్ డి టి జి సత్యనారాయణ, మండల సర్వేయర్ వి సాయికుమార్ స్వీకరించారు. ఇందులో ఎక్కువగా ఉమ్మడి ఎల్ పి.యం లు, పట్టాదారు పాస్ పుస్తకాలు మార్పు కొరకు దరఖాస్తులు వస్తున్నాయని వారు తెలిపారు. ఇంతవరకు జరిగిన రెవెన్యూ సదస్సులు నెమలాం లో 38 దరఖాస్తులు, గంగన్న పాడు 41 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వై ఎం. కె. ఎస్ నాయుడు, వీఆర్వో గణపతి మరియు విఆర్వోలు బృందం రవికుమార్, స్వప్న, సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదగుడిపాల రీ-సర్వే గ్రామసభలో 25 ఫిర్యాదులు

విశాలాంధ్ర-వేపాడ : మండలం లోని నీలకంఠ రాజపురం శివారు పెదగుడిపాల గ్రామంలో సోమ వారం నిర్వహించిన రీ- సర్వే భూ పరిష్కార సమస్యల గ్రామసభలో 25 మంది రైతుల నుండి ఫిర్యాదులు అందాయని తహసిల్దార్ జె.రాములమ్మ తెలిపారు.ఇందుకు సంబంధించి జాయింట్ ఎల్ పి ఎం సర్వే నెంబర్ లపై పదిమంది రైతుల నుండి ఫిర్యాదులు వచ్చాయన్నారు.అలాగే సర్వే నెంబర్లలో విస్తీర్ణం తేడా ఉందని ఐదుగురు రైతుల నుండి దరఖాస్తులు అందాదయ అన్నారు.అలాగే ఖాతాలో నమోదు చేయడానికి ఐదుగురు రైతుల నుండి దరఖాస్తుల అందగా,వ్యక్తిగతంగా పేర్లతో పాటు సర్వే నెంబర్లు తప్పులు తడకలు ఉన్నాయంటూ మరో ఐదుగురు రైతుల నుండి దరఖాస్తులందరిని వీటిపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కే సన్యాసినాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతుల వెంకటరమణ,గ్రామ సర్పంచ్ గోటివాడ దేవి, ఉపసర్పంచ్ కండిపల్లి పెద నాయుడు, విఆర్ఓ సచివాలయం సర్వేయర్లు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్లలో డయేరియా మరణాలు వైసిపి తప్పిదమే..!

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వైసిపి ప్రభుత్వం హయాంలో చేసిన తప్పుల వల్లే గుర్లలో డయేరియా ప్రబలడానికి కారణమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆరోపించారు. గుర్లలోని చంపావతి నది వద్దగల తాగునీటి పథకం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి పంచాయతీ నిధులను మళ్లించడం వల్లే గ్రామాలలో పారిశుధ్యం పనులు చేయలేదని చెప్పారు. ఐదేళ్లగా పంచాయతీలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి గాలికొదిలేశారని చెప్పారు.

నేడు పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం

విశాలాంధ్ర-విజయ నగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం స్థానిక పెద్దచెరువు పడమటి భాగాన పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఇఓ డివివి ప్రసాదరావు తెలిపారు.ఈమేరకు సోమవారం సాయంత్రం పెద్దచెరువు లో హంస వాహనం పై నలభై మందితో ట్రయల్ రన్ నిర్వహించారు.ఈకార్యక్రమంలో దేవస్థానం సీనియర్ సూపరింటెండెంట్ అసిస్టెంట్ ఏడుకొండలు, రామారావు, రామతీర్థం ఇఓ శ్రీనివాసరావు, ఫిషరీస్ శాఖ ఎండి యు.చాందిని,వన్ టౌన్ ఎస్ ఐ, రామ్ గణేష్ , పురపాలక శాఖకు చెందిన శానిటరీ ఇన్స్పెక్టర్ బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇఓ ప్రసాదరావు మాట్లాడుతూ రేపు సాయంత్రం 2-4గంటలవరకు వనుగుడిలో వేదసభ, 4గంటలకు అమ్మకి పంచామృత అభిషేకం, పూలాలంకరణలు అనంతరం పల్లకిపై పెదచేరువువరకుఊరేగింపు తదుపరి మంగళవాయిద్యాలు తో హంస వాహనం పై తెప్పోత్సవం జరుగుతుందని తెలిపారు.హంసవాహనం తోపాటు మూడు ప్రత్యేక తెప్పలు పాత్రికేయులు, సంబంధితశాఖలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మద్యం షాపు ను ఎత్తివేయాలని మహిళలు నిరసన

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం మేదరబద్ద జంక్షన్‌లో మద్యం షాపు వద్దంటూ మహిళ లు చేస్తున్న నిరసన ఐదవ రోజుకు చేరు కుంది. ఎక్సైజ్ శాఖ ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దుచేసి శ్రీలక్ష్మి వైన్ షాప్ ను వెంటనే ఎత్తివేయాలని మద్యం షాపు తీసేంతవరకు ఈ నిరసన కొనసాగు తుందని తీయకపోతే ఈ నిరసనను ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

ఈనెల 24 నా మెగా జాబ్ మేళా

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ(ఏపీ ఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా 24-10- 2024 అనగా గురువారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. కేశవరావు మరియు జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాలు గల విద్యార్థిని, విద్యార్థులు అర్హులని వారు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు ఆధార్ కార్డు తో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాలు నందు హాజరు కావాలని జాబ్ మేళా కోఆర్డినేటర్ జి.ఈరన్న తెలిపారు. ఈ జాబ్ మేళాకు హెటిరో డ్రగ్స్, జెస్ట్ దయల్ లిమిటెడ్, భారత్ పే, గ్లాండ్ ఫార్మ, శ్రీ రామ్ ఫైనాన్సు లిమిటెడ్ మొదలగు 5 బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీ లో ఎంపిక చేసుకోవటం జరుగుతుందని కావున ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువత తమ వివరములను skilluniverse.apssdc.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా రెస్యూమ్ ,ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ జెరాక్స్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశంలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలుకు ఈ క్రింది ఫోన్ ఫోన్ నెంబర్ 7995691295 సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ భారీ ర్యాలీ

విశాలాంధ్ర-బొబ్బిలి : అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక పోలీస్, ప్రజలు కృషిచేయాలని శాంతి భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు సమాజంలో ప్రతి ఒక్కరూ సంస్మరణ చేసుకోవాలని పట్టణ సీఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణం కోటి చెరువు గట్టు దగ్గర ఉన్న సాయి డిగ్రీ కాలేజీ నుండి కాంప్లెక్స్ వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ సీఐ సతీష్ కుమార్ విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమర వీరుల కుటుంబాలతో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మమేకమయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు అమరవీరులు షేక్ ఇస్మాయిల్ సతీమణి షేక్ బాబీ జాన్, ఎస్.సూర్యనారాయణ రెడ్డి సతీమణి రాజు, చిట్టిపంతుల చిరంజీవిరావు సతీమణి విశాలాక్షిలతో మమేకమై, వారి యోగ, క్షేమాలు, పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం, పోలీసు అమర వీరుల కుటుంబాలతో కలసి జిల్లాఎస్పీ మరియు ఇతర పోలీసు అధికారులు అల్పాహారం చేసి, వారితో కొంత సమయాన్ని గడిపారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు పండ్లు, నగదును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేసారు. ఎప్పుడు ఏ అవసరమున్నా పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు తమను సంప్రదించ వచ్చునని తెలిపి, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ తాము అండగా ఉంటామన్న భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, సిఐలు ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, ఈ. నర్సింహమూర్తి, ఎ.సత్యన్నారాయణ,బి.వెంకటరావు, ఎల్.అప్పలనాయుడు, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, పోలీసు అసోసియేషను రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో వాలంటీర్ల ఉద్యోగాలు కొనసాగిస్తామని తీర్మాణం చేయాలి

ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్ని కేబినెట్ సమావేశాలు జరిగినా వాలంటీర్లు కోసం అందులో చర్చ జరపకపోవడం చాలా బాధాకరమని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు.వాలంటీర్లుకి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని సోమవారం నగరంలో ఎ.పి గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) అధర్యంలో జిల్లా కన్వీనర్ రవీంద్ర, కో- కన్వీనర్ అచ్యుత కుమారి ల నేతృత్వంలో నిరసన ర్యాలీ నిర్వహించి కలక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఆయన స్పందించి ఈ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకునీ వెళ్ళి మీకు న్యాయం జరిగేలా చూస్తాను అని చెప్పారు.ఈ సందర్భంగా బుగత అశోక్ మీడియాలో మాట్లాడుతూ 2019 లో సచివాలయ వ్యవస్థ కంటే ముందుగానే వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతి యువకులను వాలంటీర్లుగా నియమించి వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేదయంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదిగా సేవలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తె వాలంటీర్లను కొనసాగిస్తాం అని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడం వలన వాలంటీర్లు ఆవేదన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో 2 లక్షల అరవై వేల మంది వాలంటీర్లు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారు వాలంటీర్లు అందరికీ న్యాయం చేస్తారని ఎన్నో ఆశలు పెట్టుకుని ఎన్ని రాజకీయ ఒత్తిళ్ళకి గురి చేసిన కూటమి ప్రభుత్వం గెలుపుకోసం వారి వంతుగా కృషి చేసిన వాలంటీర్ల ఆశల్లో నీళ్ళు చల్లకుండ వారి ఆవేదన అర్థం చేసుకుని ఉద్యోగాల్లో కొనసాగించాలన్నారు. 5 నెలలుగా ప్రభుత్వం నుండి గౌరవ వేతనం కూడా చెల్లించకపోతే ఎందరో మహిళలు ఆ గౌరవ వేతనం మీదే కుటుంబంలో కొంత ఆర్ధిక ఇబ్బందులను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో అటెండెన్స్ కూడా వేసుకొనే అవకాశం కల్పించడం లేదన్నారు. ఎన్నికలకు ముందు వాలంటీర్స్ అందరికి న్యాయం చేస్తామని నెలకు పదివేల రూపాయలు గౌరవ వేతనం పెంచి ఇస్తామని వాలంటీర్లు అందరికి సమాజంలో మంచి గుర్తింపు గౌరవం వుండే పద్ధతిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఎన్నికల సమయంలో గత ప్రభుత్వ రాజకీయ నాయకులు ఒత్తిడి చేసి బలవంతపు రాజీనామాలు చేయించడం వల్ల చాలా మంది వాలంటీర్స్ ఒత్తిళ్ళకి తట్టుకోలేక బలవంతంగా రాజీనామాలు చేసారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని మరచిపోకుండా వాలంటీర్స్ అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం పదివేల రూపాయలు ఇప్పించాలని, గత నాలుగు నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనాన్ని విడుదల చేయించాలని, రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వాలంటీర్లను మన్నించి తిరిగి విదుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వానికి సేవ చేయాలి ప్రజలకు సేవ

అంగన్వాడి హెల్పర్ పై రాజకీయ వేధింపులు ఆపాలి

అంగన్వాడీ జిల్లా గౌరవ అధ్యక్షురాలు లక్ష్మీ

విశాలాంధ్ర-గజపతినగరం: మండలం లోని రామన్నపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న హెల్పర్ మానాపురం సౌజన్య పై రాజకీయ వేధింపులు చేస్తూ ఆ గ్రామ నివాసి కాదని తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆమెను తొలగించడానికి చూస్తున్నారని ఆమె ఈ ఊరు కోడలు తను సర్టిఫికెట్లు అన్నీ సరిగానే ఉన్నాయని కావున సమగ్ర దర్యాప్తు చేసి ఆమెను తొలగించాలని చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని కోరుతూ సోమవారం సాయంత్రం అంగన్వాడి హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్య క్షురాలు వి లక్ష్మి ఆధ్వర్యంలో ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద ధర్నా చేశారు అనంతరం పిఓ కి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ సెక్రటరీ జ్యోతి ఎం.సుభాషిని ఆర్ దమయంతి వై పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రచ్చ చేసిన జనసైనికులు

ఆద్యంతం పవన్ పర్యటనకు ఆటంకాలు

విశాలాంధ్ర-విజయనగరం: ఉత్తరాం ధ్రకు మొదటిసారిగా విచ్చేసిన జనసే నానికి ఆ పార్టీ సైనికులే ఇబ్బంది కర పరిస్థితిలను కల్పిస్తున్నారు. తన పర్యటన అధికారికంగా జరుగుతోం దని, ఎవరూ పార్టీ నుంచి రావద్దని పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసినా గుర్ల పర్యటనను జనసైనికులు రచ్చరచ్చ చేసారు. పవన్‌ను చూసేందుకు, కలిసేందుకు యువకులు ఎగబడడంతో అంతా అయోమయంగా మారిపోయింది. డిప్యూటీ సిఎం హెూదాలో గుర్లలోని డయేరియా బాధితులను పరామర్శించేందుకు పవన్ కళ్యాణ్ సోమవారం వచ్చారు. ముందుగా గుర్ల గ్రామానికి తాగునీటిని అందిస్తున్న రక్షిత పథకంను పరిశీలించారు. అనంతరం గుర్ల పిహెచ్‌సీని సందర్శించి బాధితులను పరామర్శించారు.అలాగే గుర్ల గ్రామంలో కొందరు మహిళలతో నేరుగా మాట్లాడారు. అయితే ఈ కార్యక్రమాలలో పవన్‌కు జనసైనికుల రూపంలో ఇబ్బంది ఎదురైంది. పీహెచ్‌సీలో పోలీసుల బందోబస్తు ఉన్నా గోడలను దూకి జనసైనికులు లోపలకి వచ్చారు. దీంతో పీహెచ్‌సీ అంతా యువకులతో నిండిపోయింది. దీంతో పవన్‌కళ్యాణ్ వెంటనే అక్కడనుంచి వెళ్ళిపోయారు. గుర్లలో సైతం జనసైనికులు అతి చేయడంతో పోలీసులు చేతికి పనికల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కలెక్టరేట్‌లోనూ అదే తీరు..

చివరకు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేసేందుకు వచ్చిన పవన్‌కు అక్కడ కూడా అభిమానుల సెగ తగిలింది. దీంతో కలెక్టరేట్‌లోని అన్ని తలుపులను, ఇన్‌గేట్, అవుట్‌గేట్‌లను కూడా మూసివేసి మీడియాను, కలెక్టరేట్ సిబ్బందిని సైతం లోపలకి అనుమతించలేదు. దీంతో అనేకమంది ఉద్యోగులు, మీడియా ఇబ్బందులు పడ్డారు.

పోలీసు త్యాగాల వల్లే సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంను జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోగల 'స్మృతి వనం'లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై, అమరవీరుల స్మృతి స్థూపం వద్ద పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ సంవత్సరం అమరులైన 216మంది పోలీసుల వివరాలతో కూడిన పుస్తకాన్ని మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించగా, విధులు నిర్వహిస్తూ, తీవ్రవాదులదాడుల్లో మృతి చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లను అదనపు ఎస్పీ పి. సౌమ్యాలత చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజారక్షణలో పోలీసులు విధులను నిర్వహిస్తూ కొన్నిసార్లు ప్రాణాలను సైతం కోల్పోయే పరిస్థితి వస్తున్నదని, అయినప్పటికీ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు తమ విధులను నిర్వహించడంలో వెనుకంజ వేయక పోవడంను ప్రతీ ఒక్క పోలీసు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తేనే దేశంలో ప్రజలందరూ సుఖంగా ఉంటారని, పోలీసులు రాత్రి అనక, పగలనకా, కాలాతీతంగా, వాతావరణంతో పని లేకుండానే విధులు నిర్వహించడం వలనే నేడు మనందరం ఎంతో సురక్షితంగా జీవించగలుగుతున్నామన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎంతో ధైర్య, సాహసాలతో మావోయిస్టుల చర్యలను ఎదుర్కొంటూ విధులు నిర్వహించి అమరులైన ముద్దాడ గాంధీ, చిట్టిపంతుల చిరంజీవి, షేక్ ఇస్మాయిల్, బి.శ్రీరాములు, ఎస్.సూర్యనారాయణ నేడు మన మధ్య లేనప్పటికీ, వారి త్యాగాలను మరువలేమని, వారు మనందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని, ఎప్పుడు ఏ అవసరమున్నా సహాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జిల్లా కలెక్టరు డా. బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడుటలో భాగంగా పోలీసులు తమ రోజువారి విధులను నిర్వహిస్తూ, విధులను నిర్వహించే క్రమంలో ప్రాణాలను కోల్పోవడం దురదృష్టకరమైనప్పటికీ, అన్ని వృత్తుల్లోకి పోలీసు ఉద్యోగానికి ప్రజల్లో ప్రత్యేకమైన గౌరవం ఉందన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు రాగద్వేషాలకు అతీతంగా, ఎంతో క్రమశిక్షణతో, నిబద్ధతతో, సంయమనం పాటిస్తూ, ఎండలోను, వానలోను, 24x7 విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో 216మంది పోలీసులు వివిధ విభాగాల్లో పని చేస్తూ, తమ ప్రాణాలను కోల్పోయారని, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నారన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 21-31 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. అనంతరం, అమరులైన పోలీసులను స్మరించుకొంటూ, అమరవీరుల స్మృతి స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలను వుంచి మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, కలెక్టరు డా.బి.ఆర్. అంబేద్కర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ సౌమ్యలత, విధి నిర్వహణలో అవరులైన చిట్టిపంతుల చిరంజీవి రావు, షేక్ ఇస్మాయిల్, ఎస్.సూర్యనారాయణ కుటుంబ సభ్యులు, పలువురు డిఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పోలీసు అమర వీరుల స్థూపం వద్ద రీత్ లను, పుష్పాలను సమర్పించి, పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. రిజర్వు ఇన్స్పెక్టరు ఎన్.గోపాల నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పరేడ్ నిర్వహించగా, అమర వీరులకు తుపాకుల విన్యాసంతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి వెలమల శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవరించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ, 2 నిమిషాలు మౌనం పాటించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టరు డా. బిఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యే అధితి విజయలక్ష్మి, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇతర పోలీసు అధికారులు మమేకమై, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, వారికి. పండ్లు,నగదును అందజేసి, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న భరోసాను కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి దిశ పోలీసు స్టేషను వరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల సేవలను కీర్తిస్తూ, ర్యాలీ, మానవ హారం నిర్వహించి, నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి, పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, ఇంటిలిజెన్సు అధికారి వెంకట నాయుడు, ఎ.ఓ. శ్రీనివాసరావు, పలువురు సిఐలు, ఆర్ఐలు, డిపిఒ పర్యవేక్షకులు, ప్రభాకరరావు, వెంకటలక్ష్మి, పోలీసు అసోసియేషను రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. శ్రీనివాసరావు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, పలువురు ఎస్సైలు, ఆర్.ఎస్.ఐ.లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

ఘనంగా జనసేన పార్టీ మండల సమావేశం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్చార్జి సత్యనారాయణ విచ్చేశారు ఈ సందర్భంగా గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యచరణ రూపొందించారు ఇందులో భాగంగా మండల కమిటీలు వేయాలని నిర్ణయం తీసుకున్నారు ముందుగా శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షునిగా తాండ్రంగి ప్రసాద్ ఉపాధ్యక్షుడిగా వట్రాన రవి అదేవిధంగా శృంగవరపుకోట పట్టణ అధ్యక్షునిగా మోపాడ చిన్ని ఉపాధ్యక్షునిగా ఎలమంచిలి దేవుడు నియామకం చేస్తున్నట్టు వచ్చిన సత్యనారాయణ తెలియజేశారు.

నీటి వనరులన్నిటినీ పరిశుభ్రంగా ఉంచాలి

గత ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం

చనిపోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఎక్స్ గ్రేషియో

ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-విజయనగరం : రక్షిత తాగు నీటిని పొందడం ప్రజల ప్రాథమిక హక్కని, తాగు నీరు కలుషితం అయ్యి 10 మంది మరణించడం అత్యంత బాధాకరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతి రాజ్ శాఖా మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. పంచాయతి రాజ్, వైద్య శాఖలు బాధ్యతగా పని చేసి, జవాబు దారీతనగా ఉండాలని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో గుర్ల ఘటన పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కలుషిత నీటిని వినియోగించడం వలన 10 మంది చనిపోయినందుకు విచారం వ్యక్తం చేస్తూ మరణాలకు గల కారణాల పై అధికారులను ఆరా తీసారు. నీటి ట్యాంక్ లను ఎప్పుడు పరిశుభ్రం చేస్తున్నారు, పారిశుధ్య పనులు ఎలా చేపడుతున్నారు డయేరియా కేసులను గుర్తించిన తర్వాత ఆర్.డబ్ల్యు.ఎస్., వైద్య శాఖ, పంచాయతి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారని అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ స్పందిస్తూ మొట్టమొదటి కేసు ఈ నెల 14 న గుర్తించడం జరిగిందని, అదే రోజున నీటి పరీక్షలను జరిపిన తర్వాత చంపావతి నీటిసరఫరా ను , వ్యక్తిగత బోర్లను ఆపివేయడం జరిగిందని, టాంకర్ల ద్వారా క్లోరినేటేడ్ నీటిని సరఫరా చేయడం జరిగిందని, బాధితుల కోసం అదే గ్రామం లో మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేసి వైద్యం అందించడం జరిగిందని వివరించారు. తక్షణ వైద్యమందిస్తున్నప్పటికీ అప్పటికే డయేరియా తో బాధ పడుతున్నవారి వలన క్రాస్ ఇన్ఫెక్షన్ వలన వయో వృద్ధులు కావడం తో చనిపోయారని తెలిపారు. ఆ రోజు నుండి గుర్లలోనే కాకుండా జిల్లా అంతటా స్పెషల్ క్లోరినేషన్ డ్రైవ్ చేపడుతున్నామని, దీనిని ఇంకొన్నాళ్ళు కొనసాగిస్తామని తెలిపారు. బహిరంగ మల విసర్జన వలన కూడా నీటి వనరులు కలుషితమైనట్లు భావిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గుర్ల పరిస్థితి లు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశం లో రాష్ట్ర సర్ఫ్, ఎం.ఎస్.ఎం.ఈ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు , శాసన సభ్యులు కిమిడి కళా వెంకట రావు, అదితి గజపతి రాజు, కోళ్ళ లలిత కుమారి, లోకం నాగ మాధవి , స్వచాంధ్ర కార్పొరేషన్ ఎం.డి గంధం చంద్రుడు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డి.ఎం.హెచ్ ఓ డా.భాస్కర రావు, డి.పి.ఓ వెంకటేశ్వర రావు, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ ఉమా శంకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ సరిత, అటవీ అధికారులు, పంచాయతి రాజ్ అధికారులు, ఈ.ఓ. పి.ఆర్.డి లు ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియా తో మాట్లాడుతూ గుర్ల సంఘటన ఆవేదన కలిగించిందని, సమస్యను లోతుగా పరిశీలించి విశ్లేషిస్తే గత 5 ఏళ్ళలో గత ప్రభుత్వం పంచాయతి నిధులు సద్వినియోగం చేయలేదని పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని , అలాగని గత ప్రభుత్వం మీద నెట్టేసి బాధ్యతల నుండి తప్పుకోవాలను కోవడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రం లో అనేక చోట్ల ఈ సమస్య ఉందని ఇది గత ప్రభుత్వం తప్పిదం వలన వారసత్వంగా సంక్రమించిందని, ఇటీవల గుడివాడ లో వెలుగొండ లో పల్లె పండగ లో అనేక చోట్ల ఈ సమస్య పై ప్రజలు చెప్పారని తెలిపారు. పని చేయాలనే సంకల్పం తో ఉన్నాం కనుక అదే రోజున నీటి పరీక్షలు జరిపించి పారిశుధ్యం కోసం నిధులు విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. గుర్ల లో చంపావతి సోర్స్ పాయింట్ ను పరిశీలించడం జరిగిందని, ఒక లైన్ గుర్ల కు, వేరొక లైన్ గరివిడి కు వెళ్తోందని, గుర్ల వెళ్ళే లైన్ లో కలుషితం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేయడం జరిగిందని తెలిపారు. అధికారుల ఒపీనియన్ ప్రకారంగా బహిరంగ మల విసర్జన కూడా కలుషితం కావడానికి ఒక కారణం గా భావించడం జరిగిందని తెలిపారు. బహిరంగ మల విసర్జనను వెంటనే ఆపాలని, లేకుంటే ప్రమాదకరంగా జీవనం మారుతుందని అన్నారు. పరీవాహిక ప్రాంతాలకు ఆనుకొని వున్న ప్రాంతాలలో చెత్తా చెదారం వుంటే నీటి కాలుష్యం పెరుగుతుందని, బహిరంగ మల విసర్జన పై, నదీ పరీవాహిక ప్రాంతాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ప్రభుత్వం తో పాటు ప్రజలకు బాధ్యత ఉంటుందని, స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ ద్వారా చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని తెలిపారు. జల జీవన్ మిషన్ క్రింద కేంద్రం నిధులు అధికంగా మంజూరు అయినప్పటికీ గత 5 ఏళ్ళలో కనీసం వాటర్ ట్యాంక్ ల ఫిల్టర్లను కూడా మార్చలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా కూడా విడుదల చేయలేదని , 15 వ ఫైనాన్సు నిధులు గానీ, పంచాయతి నిధులు గానీ ఇవ్వలేదని, ఎద్దేవా చేసారు. వారి నిర్లక్ష్యం వల్లనే నేడు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందని అన్నారు. వీటిని సరిదిద్దాలనే ఉద్దేశ్యం తోనే ఈ నెల లోనే జే జే ఎం రాష్ట్ర వాటా నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఉత్తరాంధ్ర లో వాగులు, గెడ్డలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని, అన్నిటికి గాట్లను కట్టి పరిశీలిస్తామని , కాలుష్యాన్ని అరికట్టడానికి డంపింగ్ యార్డులను కూడా దూరంగా ఉంచవలసిన అవసరం ఉందని అన్నారు. నిధుల కోసం అవసరమైతే ప్రధాని తో మాట్లాడి నిధులు కోసం ప్రయత్నం చేస్తానని అన్నారు. చనిపోయిన వారికీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ మరణించిన వారి కుటుంబాలకు తన స్వంత నిధుల నుండి మానవతా దృక్పథం తో ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు మంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు.

చొల్లంగి పేట సచివాలయ సిబ్బందికి సన్మానం

సర్పంచ్ కోరాడ కనకరాజు

విశాలాంధ్ర-డెంకాడ: మండలం లోని చొల్లంగి పేట సచివాలయం సిబ్బందికి గ్రామ సర్పంచ్ కోరాడ కనకరాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు వీరు గత 2019 నుండి 2024 వరకు పనిచేసిన గ్రామ కార్యదర్శి ఎల్ శ్రీదేవి వెల్ఫేర్ అసిస్టెంట్ అనిత ఇంజనీరింగ్ అసిస్టెంట్ రేవంత్ డిఏ క్రాంతి ప్రసాదు ని ఘనంగా సత్కరించి సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో గ్రామానికి చేసిన సర్వీసును గుర్తు చేసుకుని వీరికి సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు వీరికి జ్ఞాపికలు బొకేలు శాలువాలతో ఘనంగా సత్కరించారూ మొన్న జరిగిన బదిలీలలో వివిధ ప్రాంతాలకు బదిలీలపై వెళ్లారని వారిని ఈరోజు ఆహ్వానించి సన్మాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రస్తుత గ్రామ కార్యదర్శి తో పాటు ప్రస్తుత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో వీధి లైట్లు వెలిగేలా చేయండి

రాజాం మున్సిపాల్టీ పరిధి ప్రజల విజ్ఞప్తి

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజు సాయంకాలం ఆరు గంటల 15 నిమిషాలకు వీధి లైట్లు వెలుగుతున్నాయి. సుమారు చీకటి పడిన గంట సమయం తరువాత వీధిలైట్లు వెలుగుతున్నాయి.గత కొద్ది రోజుల నుండి మారుతున్న కాలానికి అనుకూలంగా చీకటి పడే సమయానికి వీధిలైట్లు వెలిగినట్లు చర్యలు తీసుకోవాలని రాజాం పట్టణ పరిసర వీధులలో ఉన్న వాసులు కోరుతున్నారు. ప్రస్తుతం 5:15, 5:30 గంటల సమయానికే చీకటి పడుతుండటంతో వీధులలో రోడ్ల పైన వెళ్లాలంటే ఏ పాములు, పురుగులు కరుస్తాయో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. గత ఏడాది ఒక వృద్ధుడు రోడ్డుపై వెళ్తుంటే పాము కాటుకి గురై మృతి చెందిన ఇలాంటి ఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు స్పందించి చీకటి పడే సమయానికి లైట్లు వెలిగేటట్టు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మెంటాడ : సోమవారం మెంటాడ గద్దించెట్టు వద్ద రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.ఆంధ్ర పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొనిశ గ్రామానికి చెందిన పాకలపాటి అప్పల నరసింహరాజు(57) ఆగూరు వెళుతుండగా మెంటాడ గద్దించెట్టు వద్ద ఎదురుగా రాజస్థాన్ కు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై స్పీడుగా వచ్చి ఢీకొన్నారు.దీంతో అప్పలనరసింహరాజు కు తీవ్రగాయాలు కాగా స్థానిక పిహెచ్ సి కు తరలించగా మార్గ మధ్యలో తుదిశ్వాస విడిచారు.దీంతో ఆంధ్ర ఎస్ఐ కె సీతారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం కమ్యూనిటీ ఆసుపత్రి కి తరలించారు.

ధిమ్సా వార్తా పత్రికను ఆవిష్కరించిన ప్రొఫెసర్ కట్టిమని



విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తన అధికారిక వార్తా పత్రిక ధిమ్సా' తొలి సంచికను విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ టి.వి. కట్టిమని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధిమ్సా యూనివర్శిటీ విజయం, విద్యార్థుల ప్రగతి, సాంస్కృతిక వైవిధ్యాన్ని కలిపే ఒక వేదికగా నిలుస్తుందన్నారు. 'ధిమ్సా' యూనివర్శిటీ ముఖ్య విజయాలు, క్యాంపస్‌లో జరిగిన ప్రధాన సంఘటనలు, విశ్వవిద్యాలయం ఉన్న ప్రాంతాల్లోని గిరిజన సంస్కృతి ప్రతిబింబాలను ప్రదర్శిస్తుందని, యూనివర్శిటీ సముదాయాన్ని కలిపే వేదికగా నిలుస్తుందని తెలిపారు. క్యాంపస్‌లోని ప్రతి ఒక్కరిని కలుపుతూ, సంచార సమాచారానికి శక్తివంతమైన సాధనంగా సేవలు అందించనుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసన్, సిఓయి ప్రొఫెసర్ కివడే, డీన్లు ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ వార్తా పత్రిక యూనివర్శిటీ అభివృద్ధికి ప్రతిబింబంగా నిలుస్తుందని అందరూ అభినందించారు.

మృతుడు ఆచూకీ తెలియజేయండి

పట్టణ సీఐ సతీష్ కుమార్

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం షాదీ ఖానా వద్ద ఉన్న చెరువు పక్కన గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికలు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ సీఐ సతీష్ కుమార్, ఎస్సై రమేష్ సంఘటన స్థలము చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహం ను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చి , తిరిగి వెళుతున్న సమయంలో చనిపోయి ఉండవచ్చని పోలీసుల అవమానిస్తున్నారు. పై ఫోటోలో కనిపిస్తున్న మృతుడికి సంబంధించి వివరాలు తెలిసినట్లయితే, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పట్టణ సీఐ సతీష్ కుమార్ 9121109422, ఎస్సై రమేష్ 9121109454.. ఫోన్ నెంబర్లకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

ఆదర్శ రైతు గౌరీశ్వరరావు ను సత్కరించిన వెంకయ్య నాయుడు

విశాలాంధ్ర-రాజాం: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రాజాం కు చెందిన పెంకి గౌరీశ్వరరావు ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సత్కరించారు. ఆయనకు ఆదర్శరైతు అవార్డు ను అందజేసారు. వంగర మండలం కొప్పర కొత్తవలస లొ ఆయన చేస్తున్న ప్రకృతి వ్యవసాయం ను ఇటీవల స్వచ్ఛంద సంస్థ పరిశీలన చేసి, ఆయనకు ఈ అవార్డును ప్రకటించింది. దీనిని వెంకయ్య నాయుడు ఆయనకు అందిస్తూ, అభినందించారు. గౌరీశ్వరరావు లాంటి రైతులు దేశానికి అవసరమన్నారు.

బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'' (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఆదేశాలతో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత సోమవారం నిర్వహించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించి, ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ ప్రజల నుండి 42 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 15, కుటుంబ కలహాలకు సంబంధించి 4 ఫిర్యాదులు, మోసాలకు పాల్పడినట్లుగా 6 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించి, పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఎస్ఐ రాజేష్ మరియు ఇతర పోలీసు అధికారులు, పాల్గొన్నారు. ..

గౌరీశ్వరరావు కు రైతు నేస్తం పురస్కారం

విశాలాంధ్ర-వంగర: పకృతివ్యవసాయం రైతు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పెంకిగౌరీశ్వరరావు కు ప్రకృతివ్యవసాయం చేసే రైతుల కిచ్చి గౌరవించే రైతునేస్తం పురస్కారాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు గన్నవరం దగ్గరలో ఉన్న ఈ ఆత్కూరు లో అందజేసారు. భారతి ట్రస్ట్‌లో మమ్మెంటో సర్టిఫికేట్ అందజేసి ఘనంగా గౌరీశ్వరరావుమాష్టారును సత్కరించారు రైతునేస్తంపొండేషన్ వారు స్వర్గీయ డా'' ఐ వి సుబ్బారావు పేరిట ఈ అవార్డు లనుఅంకితబావంతో ప్రకృతివ్యవసాయం చేసే రైతులకు అందజేసి గౌరవిస్తున్నారు గౌరీశ్వరరావు గతపదేల్లుగా విజయనగరం జిల్లా వంగర మండలం కె కొత్తవల్స గ్రామ పరిదిలో రెండెకరాల మాగానీభూమిలో దేశవాళీ వరి దాన్యం పెసలు మినుములు నువ్వులు వంటి పంటలు పండిస్తున్నారుప్రతి ఏడాది మార్చి నెలలో జీలుగులు కట్టెలు తోపాటు పెసలు మినుములు జొన్నలు ఉలవలు కందులు వంటి పలు రకాల పంటలు వేసి పంట ఫలితాలను తీసిన అనంతరం మిగిలిన పంటలు కలియదున్నుతారు మే నెలలో గొర్రెల మందలు ఆ యిస్తారు మరల ఋతుపవనాలు ముందు పచ్చిరొట్ట విత్తనాలను వేసి పూత దశలో కలియదున్ని అనంతరం వరి నాట్లు వేసి ప్రతి 15 రోజులకుఎకరాకు నాలుగవందలలీటర్ల ద్రవజీవామృతాన్ని 40లీటర్ల చేప ద్రావణాన్ని కలిపి వేసి రసాయన ఎరువులు పంటలకు దీటుగా దిగుబడులు సాగిస్తున్నారు అలాగే4 ఎకరాల మెట్టబూమిలో మామిడి జీడి సపోట వంటి పండ్ల తోటలు లో పచ్చిరొట్ట ఎరువులు వేసి పంటవైవిద్యాన్నిపాటించి పలు పంటలు వేసి పండిస్తున్నారు ప్రస్తుతం ఈ పంటలు పొలంలో ఉన్నవి ఆగస్టు నెలచివర్లో హైదరాబాద్ నుండి రైతునేస్తంపొండేషన్ బృందం గౌరీశ్వరరావు పంట పొలాలను పరిశీలించి పంటలు పండించేవిదానాన్ని తెల్సుకుని ఈ అవార్డు కు ఎంపిక చేసారు ఈ నేపథ్యం గౌరీశ్వరరావు 35సంవత్సరాలు ఉపాధ్యాయునిగా పనిచేసి దేశంలో ప్రతిష్టాత్మక మైన గౌరవ రాష్ట్రపతిఅవార్డ స్వీకరించారు జన విజ్ఞాన వేదిక సంస్థ లో జిల్లా లో కీలకంగా పనిచేసి అక్షరాస్యత , సారా వ్యతిరేక ఉత్యమాలలోకీలకంగాపనిచేసి అదికార్ల ప్రజల మన్ననలు పొందారు విజయనగరం శ్రీకాకుళం జిల్లా లలో గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు కుమారుడైన రెడ్ క్రాస్ చైతన్య సహకారాన్నందించేవాడు ప్రకృతివ్యవసాయం విజయగాధలు రచయితగా తోటపల్లి జట్టు సంస్థ వ్యవస్థాపకఅద్యక్షులు డా డి పారి నాయుడు గారి సూచనల మేరకు గుంటూరు అనంతపురం విజయనగరం శ్రీకాకుళం జిల్లాలలో ప్రకృతివ్యవసాయం రైతులపంట పొలాలను పరశీలించి విజయగాధలు వ్రాసి ప్రభుత్వానికి అందజేసినారు. ప్రకృతివ్యవసాయం పాఠ్యాంశాలు రచయితగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకృతివ్యవసాయం పాఠ్యాంశాలు విద్యార్థులకు సిలబస్ లో ప్రవేశపెట్టబోతున్న దశలో గౌరీశ్వరరావు పాఠ్యాంశాలు రచనలో పాల్గొంటున్నారు. కళాకారునిగా సినిమాలో అవకాశంకళాకారునిగా అనేక సాంఘిక నాటకాలు ప్రదర్శించి నంది అవార్డులు పొందారు. అమృత భూమి నేటి పాతాళ భైరవి జీరోఅవర్ వంకటి సినిమాలలో నటించారు. కుటుంబ సభ్యులు సహకారం భార్య చిన్నమ్మడు జాతీయ యువజన అవార్డు గ్రహీత చైతన్య డా'' జ్యోతి బస్(వ్యవసాయ శాస్త్రవేత్త) కోడల్లు అరణ డా''దివ్య సహకారాన్నందిస్తున్నారు. భవిష్యత్తులో వచ్చే ఏడాది నుండి విస్తీర్ణం పెంచి నాణ్యత గలపండిస్తానని రైతు గౌరీశ్వరరావు తెలిపారు రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారుఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతుసాదికారసంస్థ చైర్మన్ టి విజయకుమార్ రైతునేస్తం పౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ వెంకటేశ్వరరావు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలనుండి ప్రకృతివ్యవసాయం రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర విశ్వవిద్యాలయాలకు స్థానికులనే విసిలుగా నియమించాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ఉత్తరాంధ్ర జిల్లాల విశ్వవిద్యాలయాలకు స్థానిక ఆచార్యులనే వైస్ ఛాన్సలర్లుగా నియమించాలని టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర రమణమూర్తి కోరారు. గుర్ల మండలంలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకట్రావు కోళ్ల లలిత కుమారికి ఉత్తరాంధ్ర విద్యార్థి సేన తరుపున సోమవారం వినతిపత్రం అందజేశారు. సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతం దేశంలోనే అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, ముఖ్యంగా విద్యారంగంలో మరింత వెనుకబడి ఉందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖపట్నం, జేఎన్టీయూ గురజాడ విజయనగరం, అంబేద్కర్ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం, ట్రిబుల్ ఐటీ శ్రీకాకుళం వంటి విశ్వవిద్యాలయాలు పరిపాలన విషయంలో స్థానికేతరులకు పెద్దపీట వేయడం వల్ల ఉన్నత విద్య ఉత్తరాంధ్ర విద్యార్థులకు అందని ద్రాక్షగానే మారిందన్నారు. గత 100 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాలను ఉత్తరాంధ్రేతర ఆచార్యులు వీసీ లుగా పరిపాలించడమేనని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన అర్హులైన ఆచార్యులను వైస్ ఛాన్సలర్ లుగా నియమిస్తే , ఈ ప్రాంత విద్యార్థులకు అడ్మిషన్లు, నియామకాల లోనూ న్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతం విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంతంలో అర్హులైన ఆచార్యులకు కొదువ లేదని, దేశంలోనే పేరెన్నిగన్న మేధావులు చాలామంది ఈ ప్రాంతం నుంచి వెళ్లిన వారేనని గుర్తు చేశారు. 1926లో ఏర్పడిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 100 సంవత్సరాలు కాలంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కేవలం ముగ్గురు ఆచార్యులు 9 సంవత్సరాలు వైస్-ఛాన్సలర్లుగా పనిచేశారని చెప్పారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళితే తప్పకుండా ఉత్తరాంధ్ర విద్యార్థులకు న్యాయం చేస్తామని, ఉత్తరాంధ్ర ఆచార్యులనే ఉత్తరాంధ్ర విశ్వవిద్యాలయాలకు వీసీ లుగా నియమించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

చెల్లాపురం పల్లె పండుగ ను ఆపేయండి..!

ఎంపిడిఓ భాస్కరరావు మౌఖిక ఆదేశాలు!

ఆపడానికి కారణాలు చెప్పాలని డిమాండ్ చేసిన సర్పంచ్

రాజకీయ కక్షతోనే పల్లె పండగ ఆపేసారు: సర్పంచ్ లక్ష్మీ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలం లో గల చెల్లాపురం గ్రామ పంచాయితీ లో పల్లె పండగను ఆపేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.భాస్కరరావు సోమవారం మౌఖిక ఆదేశాలు ను జారీచేశారు. ఎంపిడిఓ భాస్కర రావు ఆదేశాలు ప్రకారం చెల్లాపురం గ్రామ పంచాయితీలో 21 వ తేదీన జరగవలసిన పల్లె పండుగ ప్రారంభోత్సవం ను ఉపాధి హామీ పథకం అధికారులు, పంచాయితీ కార్యదర్శి నిలిపివేశారు. మొదటి విడత మంజూరు అయిన 22 పంచాయితీల్లో ఒక్క చెల్లాపురం పంచాయితీ లో పల్లె పండుగ తప్ప మిగిలిన 21 గ్రామ పంచాయితీ లలో పల్లె పండుగ కు అధికార్లు ప్రారంభోత్సవాలు జరిపేసారు. దీనిపై గ్రామ పంచాయితీ (తెలుగుదేశం పార్టీ) సర్పంచ్ ఆల్తి. లక్ష్మీ నరసమ్మ తీవ్రంగా మనస్థాపం తో ఆవేదన చెందారు . పల్లె పండగను ఆపేయడానికి కారణం చెప్పాలని ఎంపీడీఓను ప్రశ్నించారు. దేశానికి పంచాయితీలే పట్టుకొమ్మలని మాటలకే పరిమితం చేతల్లో లేదని ప్రస్వామ్యాన్ని ఖూనీ చేశారని, ఎంపిడిఓ ను నిలదీశారు. రాజకీయ కక్ష తో నాయకులు చెప్పినట్లు, చెల్లాపురం లో పల్లె పండుగ ను జరగకుండా చేసి ప్రభుత్వ ఆశయాలుకు తూట్లు పొడిచారని అన్నారు. ప్రభుత్వ కార్య క్రమాన్ని అకారణంగా ఆపేసిన ఎంపిడిఓ పై న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు. రాజకీయాలను అభివృద్ధి పనులపై ఆపాదించిన ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి గా ఉన్న ఎంపిడిఓ పై ఉన్నతాధికారులకు మాజీ సర్పంచ్ రెడ్డి.వరం సహకారంతో ఫిర్యాదు చేస్తానని ఆమె అన్నారు. తప్పు చేసిన అధికారులు పై చర్యలు తీసుకునేంత వరకూ అవసమైతే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని సర్పంచ్ ఆల్తి. లక్ష్మీ నరసమ్మ వెల్లడించారు. పల్లె పండుగ ను ఎందుకు నిలిపేసారని సర్పంచ్, మాజీ సర్పంచ్ రెడ్డి.వరం తో కలసి ఎంపిడిఓ ను ప్రశ్నించగా సమాధానం చెప్పేందుకు నిరాకరించారని సర్పంచ్ ఆవేధన వ్యక్తం చేశారు. ఒక మహిళా సర్పంచ్ పై అధికార పార్టీ రాజకీయ నాయకులు చెప్పినట్లు ఎంపిడిఓ వ్యవహరించడం బాధాకరమని అన్నారు. ఈ నెల17 నుండి 21వరకు 22 గ్రామ పంచాయితీ లకు పల్లెపండగ షెడ్యూలు లో చెల్లాపురం 21 న ప్రారంభోత్సవం చేయవలసి ఉంది. కానీ ఎంపీడీఓ మౌఖిక ఆదేశాలు తో గ్రామ కార్యదర్శి నిలుపుదల చేయటం జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి వివరణ :ఈ విషయమై ఎంపిడిఓ భాస్కర్ రావును వివరణ కోరేందుకు విశాలాంధ్ర ప్రయత్నించగా అందుబాటులో లేనందు వలన పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ ను వివరణ కోరగా ఎంపిడిఓ పల్లె పండుగ కార్యక్రమంను సోమవారం నిలుపుదల చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేయటంతో నిలుపుదల చేయటం జరిగిందని అన్నారు.తదుపరి తేదీ ప్రకటించిన తర్వాత కార్యక్రమం ప్రారంభిస్తామని వివరణ ఇచ్చారు.

మండల సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలి

సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ వెల్లడి

విశాలాంధ్ర-మెంటాడ: మెంటాడలో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పార్టీ మండల మూడవ మహాసభ జరిగింది .ఈసందర్భంగా మెంటాడ సినిమా హాల్ జంక్షన్ నుండి సంత తోట మీదుగా శ్రీశ్రీశ్రీ కళ్యాణవెంకటేశ్వర స్వామి గుడి వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం మహాసభ సూచక జెండా ఆవిష్కరణ, ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం తెలియజేయడం జరిగింది. ఈ మహాసభ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ మెంటాడ మండల సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని, ముఖ్యంగా గుర్లగెడ్డ ప్రాజెక్టును త్వరితగతిన వెంటనే పూర్తి చేసి రైతులకు సాగు భూములకు సాగునీరు అందించాలని, గిరిజనులు దళితులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకి వెంటనే పట్టాలు ఇవ్వాలని, స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయిన ఇప్పటికీ గిరిజనులకి రోడ్డు సౌకర్యం లేక డోలి మోత తప్పటం లేదని, మంచినీరు సౌకర్యం లేక వాగునీరే తాగాల్సిన దుస్థితి ఏర్పడుతుందని కావున వెంటనే గిరిజన గ్రామాలకి రోడ్లు, మంచినీరు సౌకర్యం కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు అమలుఅయ్యేలా చట్టం చేయాలని, పెరిగిన ధరలు తగ్గించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని భవిష్యత్తులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన పోరాటాలు ఉధృతం చేయాలని ఈ మహాసభలో తీర్మానం చేయడం జరిగింది. అనంతరం మండల ఆర్గనైజింగ్ కమిటీ ఏడుగురుతో ఏర్పాటు చేయడం జరిగింది. మండల కన్వీనర్ గా రాకోట రాములును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి లక్ష్మి, ఆర్. హరికృష్ణ వేణి, గిరిజన సంఘ జిల్లా సహాయ కార్యదర్శి టి సోములు, అప్పల నరసయ్య, సిహెచ్ కృష్ణవేణి, పెద్ద రాము, పొట్నూరు వరలక్ష్మి, ఎల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వేగ నిరోధకాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడండి : లోక్ సత్తా

విశాలాంధ్ర-బొబ్బిలి : విజయనగరం నుండి పార్వతీపురం వెళ్లే ప్రధాన రహదారి పై బొబ్బిలిలో కొన్ని చోట్ల వేగ నిరోధకాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు లోక్ సత్తా పార్టీ తరపున ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదర రావు కోరారు .ఈ నెల 18 వ తేదీ శుక్రవారం రాత్రి రైల్వే వంతెనపై ప్రమాదం జరిగి ఇద్దరు దుర్మరణం చెంది.ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని ఇది చాలా హృదయ విదారక సంఘటన అన్నారు. లోక్‌సత్తా పార్టీ తరపున చాలా సార్లు చెప్పాను. ప్రమాదాలు జరగకముందే నివారణ చర్యలు తీసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా విజయనగరం పార్వతీపురం రహదారిలో మన బొబ్బిలి ప్రాంతంలో గ్రోత్ సెంటర్, ఐటిఐ దగ్గర, రైల్వే వంతెన రెండు వైపులా అలాగా తారక రామా కాలనీ దగ్గర ఉన్న జూట్ మిల్లు దగ్గర తరచూ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా మన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతూన్నాయని అన్నారు. పైన తెలిపిన ప్రదేశాలలో వేగ నిరోధకాలు ఏర్పాటు చెయ్యడం చాలా అవసరం. అలాగే ఆయా ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు తక్షణమే ఏర్పాటు చెయ్యాలని. ఈ రైల్వే వంతెనపై చాలా మంది వాహన దారులు చాలా వేగంగా ప్రయాణించి ముందు వాహనాలను ఓవర్ టేక్ చెయ్యడం నేను చాలా సార్లు గమనించాను. దీనివలన ప్రమాదాలు జరగడానికి చాలా అవకాశం ఉంది. ఈ వంతెనపై ఎట్టి పరిస్థితలలోను తక్కువ వేగంతో వెళ్లాలని, ఓవర్ టేక్ చెయ్యొద్దని హెచ్చరిక బోర్డులు వంతెనకు ఇరు వైపులా ఏర్పాటు చెయ్యడం చాలా అవసరం. అలాగే బొబ్బిలి-బలిజిపేట రహదారిపై కూడా వేగ నిరోధకాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చెయ్యవలసిన అవసరం ఉంది. ఆ రహదారిపై పాఠశాలలు, చాలా కార్యాలయాలు ఉన్నాయి. స్కూల్ జోన్ బోర్డులు తప్పని సరిగా పెట్టాలి. ప్రభుత్వం దగ్గర డబ్బు లేకపోతే బొబ్బిలిలో ఉన్న వ్యాపారస్తులు, విద్యా సంస్థల వారితో మాట్లాడి వారి వ్యాపార ప్రకటనలతో ఈ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చెయ్యవలసినదిగా అధికారులకి నా విజ్ఞప్తి. దయచేసి పాలకులు, అధికారులు స్పందించి రహదారి ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

ఆలయంలో చోరీ నిందితుడు అరెస్టు

విశాలాంధ్ర-నెల్లిమర్ల :నెల్లిమర్ల మండలం దేవునినెలివాడలోని రాజరాజేశ్వరి ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడుని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామగణేష్ వెల్లడించారు. ఈనెల14న ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు చెందిన 10 గ్రాముల రెండు వెండి కిరీటాలు, హుండీలోని రూ.3000 చోరీకి గురయ్యాయి. ఈ కేసులో శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం ఇజ్జాడ పాలెం గ్రామానికి చెందిన గౌరి ప్రసాద్ ని అదుపులోకి తీసుకుని నగదు, వెండి కిరీటాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

దేశంలో కబడ్డిలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టడమే ధ్యేయం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : రాష్ట్రాన్ని కబడ్డీ ఆటలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయడం జరుగుతుందని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీకాంత్ అన్నారు. విజయనగరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గుర్తింపు కలిగిన అసోసియేషన్ మనది అని అన్నారు.మన పై న్యాయమైన ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేసి దేశానికి అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసేందుకు జిల్లా అసోసియేషన్ సహకారాన్ని అందించాలన్నారు. కబడ్డీ ప్రతిష్టను పెంచే విధంగా జిల్లా నూతన బాడి పనిచేయాలన్నారు. అనంతర జిల్లా నూతన కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా చైర్మన్ గా ఐ. వి .పి .రాజు,అధ్యక్ష కార్యదర్శులు గా ఎ. రంగారావు దొర, కె వి ప్రభావతి లు ఎన్నికయ్యారు. వీరితో పాటు 16 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్ను కోవడం జరిగిందాన్నారు. ఎన్ని కైన కార్యవర్గాన్ని రిటైర్డ్ జడ్జి సుబ్బరాజు ప్రకటించారు.సమావేశంలో పాల్గొన్న వారు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సుబ్బరాజు,,వర్కింగ్ అధ్యక్షులు అర్జునరావు, డిఎస్డివో వెంకటేశ్వరరావు, టి భగవాన్ దాస్ వాలీబాల్ కార్యదర్శి, సీనియర్ క్రీడాకారులు శ్రీను రాంబాబు నాంచారయ్య లక్ష్మణరావు క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి రాంబాబు హాజరయ్యారు.

ఏపిసిఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచరల్ ఫైర్మింగ్) స్టాల్

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లం మండలంలో సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏపిసిఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచరల్ ఫైర్మింగ్) స్టాల్ పెట్టడం జరిగిందీ. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాము మరియు వెలుగు సిబ్బంది, ఎమ్ ఈ ఓ తీర్నాదరావు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ ఉషారాణి, ఏ పి సి ఎన్ ఎఫ్ యూనిట్ ఇన్చార్జి తులసి , ఐ సి ఆర్ పి రమ, భారతి , దమయంతి పాల్గొనడం జరిగిందీ. ప్రకృతి వ్యవసాయం లో పండించిన పంటలు తినడం వల్ల ఎలా ఆరోగ్యం కాపాడుకోవచ్చు, తక్కువ ఖర్చు తో ఎలా ఎక్కువ ఆదాయం పొందవచ్చు అని చెప్పడం జరిగింది. రైతులు కెమికల్స్ వాడకుండా, ద్రవ జీవామృతం, నీమస్త్రం, జిల్లేడు ద్రావణం, పలుపత్ర ద్రావణం, అజ్ఞాస్త్రం, తూటికాడ కాషాయం, మారేడు కాషాయం వంటి ద్రావణాలు మరియు కషయాలు వాడుకొని ఎలా పంటలు పండించవచ్చు అని యూనిట్ ఇన్చార్జి తులసి వివరించారు.

నేడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలపై సమావేశం

విశాలాంధ్ర-వేపాడ : వేపాడ మండల తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్య కర్తలకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలపై మంగళవారం సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు తెలిపారు.ఈ సమావేశం శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి స్వగృహమైన పార్టీ కార్యాలయం లక్కవరపు కోటలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.కావున మండలంలోని 29 గ్రామపంచాయతీలలో గల ప్రతి గ్రామ నాయకులు, కార్యకర్తలు మండల స్థాయి నాయకులు ఈ యొక్క సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

ప్రజా వినతులు పరిష్కార వేదికకు 180 వినతులు

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : ప్రజా ఫిర్యాదుల విబాగానికి వచ్చిన వినతులకు న్యాయమైన, ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఎక్కువగా రెవిన్యూ కు చెందిన వినతులే వస్తున్నాయని, తహసిల్దార్లు ఈ విషయం లో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సోమవారం ప్రజా వినతులు పరిష్కార వేదిక లో భాగంగా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 180 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 122, వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 17 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 5 , పంచాయితీ శాఖకు 12, విద్యా శాఖకు 4 అందగా, వైద్య శాఖకు 6 అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

ఐదవ బెటాలియన్ వద్ద పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం

కమాండెంట్ మాలిక్

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని చింతలవలస 5బెటాలియంలో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా కమాండెంట్ మాలిక్ అమరవీరుల స్థూపం వద్ద అమరులైన పోలీసు వీరులకు ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1959వ సంవత్సరము అక్టోబర్ 21 నా భారత-చైనా సరిహద్దు ప్రాంతాల్లో విధి నిర్వహణలో ఉన్న భారత సిఆర్పిఎఫ్ జవాన్లపై చైనా దేశం సైనికులు జరిపిన కాల్పుల్లో పదిమంది సిఆర్పిఎఫ్ జవాన్లు వీర మరణం పొందినారు ఆనాడు జరిగిన సంఘటనలో వారు చూపించిన ధైర్యసహసాలు జ్ఞాపకాలు చేసుకుంటూ దేశవ్యాప్తంగా అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం గా జరుపుకుంటున్నామని ఈ సంవత్సరంలో మన రాష్ట్రంలో 2 మరియు దేశంలో 214 మంది పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో అమరులైనారు పోలీస్ వారి త్యాగాలకు గుర్తుగా ఢిల్లీలో స్మారక స్థూపం ఏర్పాటు చేశారని తెలిపారు దేశ సరిహద్దుల్లో రాత్రింబవళు అహర్నిశలు కష్టపడి మన ప్రశాంత జీవనం కోసం శ్రమిస్తూ మన దేశ సైనికులు కు అంతర్గత శక్తులతో పోరాడి ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు రక్షిస్తూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల సేవలు వెలకట్టలేనివి అని వారు చేసిన త్యాగాలు స్మరించుకునే అవకాశం మాకు దక్కటం చాలా గొప్ప విషయమై అన్నారు కమాండెట్ మాలిక్ చేతులు మీదుగా ఐదవ బెటాలియన్ నందు పనిచేసి విధినిర్వాహణలో శత్రు వులతో పోరాడి అసువులు బాసిన 31 మంది పోలీస్ వారి కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సత్తిబాబు జీవి ప్రభాకర్ లక్ష్మీనారాయణ ఎస్ బాపూజీ బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

90మంది విద్యార్థులకు చెక్‌రూల్ బుక్స్ పంపిణీ

ఎంఈఓ-2 బాల భాస్కరరావు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులు ఆతవ రవిశంకర్, లక్కవరపుకోటలో కేజీబీవీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అనురాధ దంపతులు సమకూర్చిన పుస్తకాలను సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోంపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల పాఠశాలల్లో 1,2 తరగతులు చదువుచున్న 90 మంది విద్యార్థులందరికి చెక్ రూల్ పుస్తకాలను మండల విద్యాశాఖ అధికారి - 2 పి.బాల భాస్కరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులందరు బాగా చదివి మీ గ్రామానికి, మీ కుటుంబానికి, మీ పాఠశాలలకు మంచి పేరు తీసుకొని రావాలని, అలాగే విద్యను ప్రోత్సహించడానికి ముందుకు వస్తున్న ఉపాధ్యాయులు రవిలా ఇలాంటి మంచి కార్యక్రమంలు అందరు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సి ఆర్ పి రామ్ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త బొడ్డాం ఎం పి పి పాఠశాల సందర్శన : ఎంఈఓ జగదీశ్వరరావు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కొత్త బొడ్డాంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జి. జగదీశ్వరరావు సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు హెచ్ఎం పి.శారదాంబ విద్యార్థులకు రంగుల పేర్లు, నెలల పేర్లు చెబుతున్నారు.మరొక ఉపాధ్యాయురాలు పద్మలత 4వ తరగతి విద్యార్థులకు తోలుబొమ్మలాట అనే పాఠంను బోధిస్తున్నారు. గత సందర్శనలో పలు విషయాలు ఉపాధ్యాయులకు తెలియజేయగా వాటిలో పాఠశాల గేటు నందు మెట్టు కట్టమని చెప్పడంతో మెట్టును కట్టించడం శుభపరిణయంగా తెలియజేశారు. తరగతి గది నిర్వహణ నందు గోడచాట్లు టి ఎల్ ఎం కొత్తవి తయారుచేసి పెట్టమని తెలియజేశారు ,విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఎండిఎం గది నందు డొక్కా సీతమ్మ పీఎం పోసన మెనూ పట్టికను ఉంచమని తెలియజేశారు.

సమస్యలు పరిష్కారం కోసమే పల్లె పండుగ

విశాలాంధ్ర-మెంటాడ: సోమవారం మెంటాడ లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు.ఈ సంధర్భంగా స్థానిక ఎంపిటిసి పతివాడ కుమారి ,రాయి పిల్లి రవిశంకర్ సచివాలయ ప్రాంగణంలో కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు.అనంతరం గ్రామ సమస్యలపై చర్చించి ప్రజలకు తక్షణం అవసరాల పనులను గుర్తించి నిధులు కేటాయించాలని అధికారుల వద్ద ప్రస్తావించారు.ఈ కార్యక్రమం లో ఎపిఓ చినప్పయ్య, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, విఆర్ఓ అప్పలనాయుడు, హైస్కూల్ స్కూల్ కమిటీ చైర్మన్ రఒఃగళఇ కన్నబాబు,ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గౌరినాయుడు,సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మౌలిక వసతులపై దృష్టి సారించండి

పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ దిశా నిర్దేశం

విశాలాంధ్ర-వేపాడ: ప్రస్తుతం సీజనల్ వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులతో పాటు మౌలిక వసతుల కల్పనలలో పంచాయతీ కార్యదర్శులు దృష్టి,సారించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ సూర్యనారాయణ దిశా నిర్దేశం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ప్రతి శుక్రవారం డ్రైడేగా భావించి కాలువలో పూడికలతో పాటు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించేలా చూడాలన్నారు. అలా నీరు నిల్వ ఉన్నచో లార్వా అనే దోమ వృద్ధి చెంది తద్వారా మనుషుల ఆరోగ్యాలకు హాని కలిగిస్తాయన్నారు.అలాగే రక్షిత మంచినీటి పథకం ద్వారా అందించే త్రాగునీటిని క్లోరినేషన్ చేయించాలని ఎటువంటి కలుషితం లేకుండా త్రాగునీరు సరఫరా చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శిల దేనిని సూచించారు.వీటిపై పంచాయతీ కార్యదర్శులు ఏమాత్రం అలసత్వం వహించిన వారి విధులలో ఏమరపాటు వహించినా సహించేది లేదన్నారు.అలాగే గ్రామంలో ముఖ్యంగా మురుగు కాలువలు, వీధిలైట్లు, తాగునీరు ఇటువంటి మౌలిక వసతుల కల్పనలో జాప్యం వహిస్తే సహించేది లేదన్నారు.మీరు చేస్తున్న విధులను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని అలాగే పని చేస్తున్న ఫోటోలను అప్లోడ్ చేయాలని సూచించారు.గ్రీన్ అంబాసిడర్ ద్వారా ఎప్పటికప్పుడు వీధులను పరిశుభ్రం చేసి ఇళ్ల నుండి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేసే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన చేయకుండా చూడాలని ప్రతి ఒక్కరికి వ్యక్తిగత మరుగుదొడ్లతోపాటు గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లును కొన్ని గ్రామాల్లో నిర్మించడం జరిగిందని వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి వాటికి మంజూరయ్యే విధంగా కృషి చేయడం,జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్జెఈ ఆలీ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సత్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్.పల్లవి జాతీయస్థాయి క్రీడలో పతకాలు

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : ఇటీవల జరిగిన యూత్ జూనియర్%ఒ% సీనియర్ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ - నాగ్రోట బాగ్వాన్ (హిమాచల్ ప్రదేశ్) లో అక్టోబర్ 6 నుండి 13 వ తేది వరకు జరిగిన వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో పాల్గొన్న సత్య డిగ్రీ %ఒ% పీజీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం బి ఎ చదువుతున్న విద్యార్థిని ఎస్ పల్లవి 71 కేజీ క్యాటగిరి సీనియర్ విభాగంలో 94 కేజీలు స్నేచ్.114 కేజీ క్లీన్, జర్క్ 208కేజీలు బరువెత్తి రెండు సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు అభినందనలు తెలిపారు, తన కృషి పట్టుదల వలననే ఈ విజయం సాధ్యమైందని, భవిష్యత్తు లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఇలాంటి విజయాలు క్రీడాకారులకు ఉత్తేజితం చేయడమే కాకుండా ఇతర విద్యార్థులకు స్ఫూర్తి దాయకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్. సి .సి. ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్య వేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చెల్లా రాము , ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరపు నాయుడు, లెఫ్టినెంట్ ఉదయ్ కిరణ్, కళాశాల ఫిజికల్ డైరక్టర్ శ్రీ. హెచ్ హెచ్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర-రాజాం: రాజాం టౌన్ తెలగవీధికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు చోరాడ.సూర్యనారాయణ వాళ్ళ చిన్నాన్న చౌరాడ శ్రీను ఇటీవలే మృతి చెందారు, ఆ విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే.రాజేష్,టౌన్ కన్వీనర్ పాలవలస.శ్రీనివాస రావు,ఆశపు.సూర్యం, వంజరాపు. విజయకుమార్, తోట తిరుమల, గంధవరపు.హేమంత్(వేగు చుక్క) సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.